# ఒక్క నిముషం

## ఎమ్. శ్యామలారాణి




చెప్పేది ఒకటి చేసేది వేరొకటి... అనే మాట ఉంటే ఉండవచ్చు కానీ నా మట్టుకు నేను చెప్పేదే చేస్తున్నానన్న ఆత్మస్థైర్యం నాకుంది. చిన్నప్పటి నుండి ఏదో చేయాలి... నలుగురికి ఉపయోగపడే పని చేయాలి... బాగా చదువుకొని... మంచి ఉద్యోగం సంపాదించి నా కాళ్ళమీద నేను నిలబడాలి... అలా ఏవేవో ఆలోచనలతోనే... బాల్యం... యుక్తవయసు... అన్నీ... దాటుతూ... నేననుకున్న గమ్యాన్ని ఇంచుమించు సాధించాననే చెప్పాలి! నా అదృష్టం కొద్దీ ఏమో ఆయనగాని పిల్లలుగాని... నా భావాలు ఆలోచనలు చూసి... ప్రోత్సహించకపోయినా... నీ ఇష్టం అన్నట్లు ఊరుకున్నారు.

"అమ్మా!... రేపటినుండి నేను పనిలోకి రానమ్మా" అని రంగమ్మ అంటుండగానే అంత ఎత్తున కోపం రంగమ్మ మీద వచ్చింది... ఎప్పుడూ రంగమ్మని పనిమనిషిగా చూడలేదు. దానికి కారణం లేకపోలేదు. ఏ పని చెప్పినా... శుభ్రంగా చేస్తుంది... అంతే కాదు... చెప్పని పనులు కూడా చేస్తుంది... అందుకే... రంగమ్మకి ఏ అవసరం వచ్చినా ఆదుకుంటూ ఉంటాను... అంతే కాదు... రంగమ్మ ఆరేళ్ళ కూతురిని పనులలో తనకి సహాయపడడానికి వెనకాల తిప్పుకుంటూ ఉంటే... రంగమ్మకి నచ్చచెప్పి... లక్ష్మిని స్కూలులో తనే జాయిన్ చేసింది... స్కూలు డ్రస్‌లు, పుస్తకాలు అన్నీ తను కొనిపెట్టింది. అంతేకాదు... లక్ష్మి బాగా చదివితే... లక్ష్మి చదివినంతవరకు చదివిస్తానని మాట ఇచ్చింది. ఈ విషయంలో ఇంట్లో వాళ్ళు తన ఇష్టానికి వదిలేసినా... ఇరుగు పొరుగు వాళ్ళు సంఘసంస్కర్త బయలుదేరిందని... మాటలనడం మొదలుపెట్టినా

తను పట్టించుకోలేదు. తనకి కావలసింది ఓ పేదింటి పిల్ల చదువుకోవాలి. తన కాళ్ళమీద తాను నిలబడాలి!... దేశంలో ఉన్న అందరి పిల్లలను పసితనం నుండే లేత భుజాల మీద బరువులు మోసుకుంటూ భారంగా బ్రతుకుతూ బాలకార్మికులుగా ఉండే వాళ్ళందరిని ఉద్ధరించకపోయినా తనకి చేతనయినంత వరకు కనీసం ఒక్క బాలకార్మికురాలినయినా ఉద్ధరించాలనుకొని లక్ష్మి భారం తనమీద వేసుకుంది.

"క్షమించండమ్మా!... తమరికి కోపం వస్తుంది. బాధపడతారని నాకు తెలుసమ్మా!... కానీ... ఏం చేయను తల్లి? ఆ దిక్కుమాలిన వోడు రిక్షాతొక్కినా, వచ్చిన డబ్బులు నా చేతికివ్వకుండా తప్పతాగి తొంగుంటున్నాడు... ఒక పూట కూడా పొయ్యి ఎలగడం లేదమ్మా! అందుకని లక్ష్మిని తమరికాడ పనిలోపెట్టి నేను మరో రెండు ఇళ్ళల్లో పని చేద్దామని... చిన్న చిన్న పనులు లక్ష్మి చేసేస్తుందమ్మా! నేను వచ్చి బట్టలుతుకుతానమ్మా! తమరు కష్టం అర్థం చేసుకుంటారని తెలిసే... మిమ్ములను అడుగుతున్నానమ్మా" అంది రంగమ్మ.

ఒక్క నిముషం... ఏం మాట్లాడాలో తెలియనిదానిలా మౌనం వహించాను. ఎక్కడి నుండి వచ్చిందో లక్ష్మి... రంగమ్మ ప్రక్కనే వచ్చి నిలబడింది.

"సంశయించకండమ్మా!... ఇళ్ళు తుడవడం... అంట్లు తోమడం... శుభ్రంగా చేస్తుందమ్మా... అలా నిలబడి చూస్తావు ఏమిటే అమ్మగారికి చెప్పు" అంది రంగమ్మ.

"బాగా చేస్తానమ్మా పని... " అంది లక్ష్మి.

పసిదాని నోటివెంటి విన్నమాట... చెళ్ మని కొరడాతో కొట్టినట్లు అనిపించింది... ఒక్క క్షణం... లక్ష్మి ముఖంలోకి చూసింది.

వారం రోజులు లంఖనాలు చేసిన దానిలా ఉంది లక్ష్మి ముఖం.

"దిక్కుమాలిన సచ్చినోడు... రిక్షా తొక్కిన డబ్బులు ఇస్తాడనుకున్నానమ్మా. రెండు రోజులనుండి పస్తులు పెడుతున్నాడు. నేను పని చేసిన ఇళ్ళల్లో డబ్బులు ముందే వాడేసుకున్నానమ్మా! మళ్ళీ ఏ ముఖం పెట్టుకుని డబ్బులు అడుగుతానమ్మా? ఆ సచ్చినోడు మారడు.. చంటోడు ఆకలికి గుక్కపట్టి ఏడుస్తున్నాడు... మళ్ళీ జన్మంటూ ఉంటే... మంచి అయ్యకి పిల్లలుగా పుట్టి చక్కగా చదువుకుంటారు" అంది.

ఏం మాట్లాడాలో తెలియని దానిలా మౌనం వహించింది. మరునిముషం గదిలోకి వెళ్ళి కుర్చీలో కూలబడింది. రంగమ్మ చెప్పిన దానిలో అబద్ధం లేదు... నాంచరయ్య పట్టి తాగుబోతు! రెండు ఇళ్ళల్లో పనిచేసి వచ్చిన డబ్బులతో ఏం బ్రతకగలరు... అలాగని... తను ఎంతో ఆశతో, ఏదో చేయాలన్న తపనతో లక్ష్మి భారం తన మీద వేసుకుంది... కాని జరుగుతుంది ఏమిటి? నో అలా జరగడానికి వీలులేదు. అన్నెం పున్నెం తెలియని లక్ష్మి బాలకార్మికురాలు కావడానికి వీలులేదు... ఎంత ఖర్చయినా ఫరవాలేదు... ఎంత శ్రమ అయినా ఫరవాలేదు అనుకొని... గభాలున కుర్చీలో నుండి లేచి బీరువా దగ్గరకు నడిచి... బీరువా తీసి... డబ్బులు తీసి హాలులోకి వచ్చింది.

"రంగమ్మా!... లక్ష్మిని మా ఇంట్లో పనికి పెట్టి నువ్వు ఎన్ని పనులు ఒప్పుకోవాలనుకుంటున్నావ్" అంది...

కొంచెం తడబడింది రంగమ్మా. "నేను ఎన్ని ఇళ్ళల్లోనయినా చేయగలనమ్మా... కాని అందరికి ప్రొద్దున్నే పనిమనిషి కావాలి కదమ్మా?... తరువాత పనిమనిషి వెళితే ఎవ రొప్పుకుంటారమ్మా? లక్ష్మిని ఇక్కడ పెట్టి... నేను రెండు ఇళ్ళల్లో పనిచెయ్యడానికి ఒప్పుకున్నానమ్మా అంది...

"ఆ రెండు ఇళ్ళవాళ్ళు ఎంత డబ్బులు నీకు ఇస్తారు రంగమ్మా?" అంది.

కంగారు చూసి... "ఒక్కొక్క ఇల్లు రెండొందలు ఇస్తారన్నారమ్మా" అంది.

"ఇదిగో ఈ ఐదువందలు... ఇవి తీసుకు వెళ్ళి... ఇంటికి కావలసిన సరుకులు కొనుక్కో!... ఇంకోసారి ఎప్పుడూ లక్ష్మిని స్కూలు మానిపిస్తామని అనకు... లక్ష్మి

## స్వాజీలాండ్ యువరాజు వినోదం

స్వాజీలాండ్ దక్షిణ ఆఫ్రికాకు, మొజాంబిక్‌కు మధ్యనున్న చిన్న దేశం. 1.20 మిలియన్ జనాభా కలిగి 1,700 చదరపు కిలో మీటర్ల వైశాల్యం కలిగి ఉన్నది. ఆర్థికంగా, వ్యాపార రీత్యా దక్షిణాఫ్రికా మీద ఆధారపడి ఉంటుంది. పంచదార, కలపగుజ్జు తయారీ ప్రస్తుతం కొనసాగుతున్న పరిశ్రమలు. జనాభాలో 40 శాతం పైన ఎయిడ్స్ వ్యాధితో బాధపడుతున్నారు. ఆఫ్రికా మొత్తంలో బీద దేశంగా పరిగణింపబడుతోంది స్వాజీ. దేశానికి రాజకీయ శాసనవిధానం (కాన్‌స్టిట్యూషన్) గానీ పార్లమెంటుగానీ లేకపోవటంతో అక్కడ రాజుల ఏకాధిపత్య పరిపాలనే (మోనార్కీ) ఇప్పుడు కూడా కొనసాగుతోంది.

ఈ దేశం పేరు ఈ మధ్య వార్తల్లోకెక్కింది. కారణం? స్వాజీలాండ్ రాజు, 36 సం. వయసుగల ఎంస్వటి యువరాజు తన 13 వ భార్యని ఈ మధ్యనే ఎన్నుకోవటం. ఆమె వయస్సు 16 సంవత్సరాలు. వెయ్యి మందికి పైగా ఆడపిల్లలు స్తనద్వయాలు ప్రదర్శించుతూ రాజు అనుగ్రహం కోసం పెరేడ్ చేశారట రాజు ముందు. ఎన్నికయిన 16 ఏళ్ళ అమ్మాయిని రాజుగారి సేవకులు విడిగా వేరేచోట భద్రంగా ఉంచారట. రాజుగారి జీవనసరళి చూస్తే ఇంత బీద దేశానికి నాయకుడని ఎవ్వరూ అనుకోరు.

ఆ మధ్య 10 మిలియన్ డాలర్ల ఖర్చుతో తన ప్రతి భార్యకీ ఒక ప్యాలస్ కట్టడానికి ఉపక్రమించాడట. తర్వాత తన స్వంత ఉపయోగానికి 50 మిలియన్ డాలర్లు ఖరీదు చేసే జెట్ విమానాన్ని ఆర్డర్ చేశాడట. అతని నిరంకుశ పరిపాలనకి హద్దులు లేవనిపిస్తుంది. తనకి ఇష్టంలేని కోర్టు తీర్పులు, వార్తాపత్రికలూ క్షణంలో నిషేధిస్తాడు. ఎవ్వరేమన్నా ఖాతరు చేయడు. ఎమ్స్వటి 18 ఏళ్ళ వయసులోనే 1982 లో సింహాసనమెక్కాడు అతని తండ్రి సొభూజ 83 సంవత్సరాల వయసులో చనిపోయాక. తండ్రిగారికి అధికార పరంగా 120 భార్యలట. అంటే మన ఎమ్స్వటిగారు తండ్రిగారి అడుగుజాడలలో అనుసరించి అదే లక్ష్యం సాధించాలంటే ఇంకా చాలాదూరం వెళ్ళాలన్నమాట. ఆయన అది సాధించేవరకూ స్వాజీవాసులకి ఆ దేముడే రక్ష.

**- వి.కె. మోహన్**



## పాట పాడిన రేఖ!

గోవిందా మీనన్, మల్లికాషెరావత్‌ల కామెడీ సినిమాలో సీనియర్ నటి రేఖ ఓ పాట పాడింది. ఓ క్లబ్ సన్నివేశంలో రేఖ ఈ పాట పాడుతుందని, వెరైటీ కోసం 'ఆమెచేతనే ఈ పాడించామని చిత్ర నిర్మాత చెప్పారు. ఖల్‌నాయక్‌లోని 'చోళీ కే పీఛే క్యా హై'ని మించి ఈ పాట ఉంటుందని చిత్ర యూనిట్ చెబుతోంది.

చదువుకోవాలి! అర్థమయిందా" అంది...

"అమ్మా!" అంది కంగారుగా రంగమ్మ.

"ఓహో అర్థమయింది రంగమ్మ... ఈ ఒక్క నెల మీరు డబ్బులు ఇస్తున్నారు... ప్రతి నెల ఎలాగమ్మా అని మనసులో అనుకుంటున్నావు కదూ" అంది.

"అమ్మా!" అంది రంగమ్మ... అప్పటికే రంగమ్మ కళ్ళల్లో నీళ్ళు నిండాయి.

"నేను అలా అనుకోవటం లేదు అమ్మా!... ఏనాడో పుణ్యం చేసుకున్నాను... ఈ రోజు దేవతలాంటి అమ్మగారి నీడ దొరికింది అనుకుంటున్నాను. కన్నతల్లిని నాకు లేని తాపత్రయం... ఒక్క నిముషం కూడ మాలాంటి వాళ్ళ గురించి ఆలోచించడానికి ఇష్టపడని మనుషులన్న ఈ లోకంలో మా గురించి మీరు ఆలోచించడం నా అదృష్టం అమ్మా!...

"వద్దమ్మా!... డబ్బులు తమరికాడనే ఉంచండి... చెట్టుకి కాయ బరువు కాదంటారు... ప్రొద్దున్నపూట కాకపోతే సాయంకాలం పూట... ఏ హోటల్లోనో, హాస్టల్‌లోనో పని వెతుక్కుంటా"నంది రంగమ్మ...

"నువ్వింకేం మాట్లాడవద్దు... ముందు డబ్బులు తీసుకువెళ్ళు..." అని లక్ష్మివైపు చూసి "బాగా చదువుకోవాలి అర్థమయిందా" అంది...

"అలాగేనమ్మా" అంది లక్ష్మి.

❁ ❁ ❁

ఎమ్.సెట్‌లో మెడిసిన్‌లో మా అబ్బాయికి సీటు వచ్చిందని సంతోషంతో వాళ్ళ డాడీ అరవై అయిదు వేల బైక్ కొని ఇచ్చారు... "అంత ఖరీదు గల బైక్ ఎందుకండీ" అనగానే... "నా కన్నకొడుకు కష్టపడి మెడిసిన్‌లో సీటు తెచ్చుకుంటే... సంతోషంగా బైక్ కొంటే ఎక్కువ ఖరీదంటావా? ఎవరో మనకు సంబంధం లేని వ్యక్తికి... ఖర్చు పెడుతున్నావ్... సంఘసేవ అంటూ... ఏదో ఒకటి చేస్తూనే ఉంటావ్" అన్నాడు ప్రసాద్...

దేశంలో ఎవరికి వారే వాళ్లకోసం చూసుకోబట్టి... బాలకార్మికులే కాదు... ఆకలి చావులు... ఫుట్‌పాత్ మీద చలిలో గడ్డకట్టి... పోయినవాళ్ళు! తినడానికి పంచభక్ష్య పరమాన్నాలు కాదు... ప్రాణం నిలబడడానికి గంజి అన్నం కూడాలేని వాళ్ళు ఇలా ఎంతో మందితో... పేదరికంతో నిండిపోయింది దేశం. అయినా... తను ఇన్నాళ్ళు సమయాన్ని వృథాగా గడుపుతూ... ఏదో మంచి చేసేస్తుందనుకొని తృప్తి పడింది.

"ఏమిటోయ్ ఈ హడావిడి... ఇంట్లో ఉండేదానివేగా... నువ్వుకూడా నాతోపాటు టిఫిన్ తినేస్తున్నావ్" అన్నాడు.

"అవునండి... నేను మీ కూడా వస్తున్నాను. మీరు వెళ్ళే త్రోవలోనే... నేను దిగవలసిన ఇన్‌స్టిట్యూట్" అంది.

"ఇన్‌స్టిట్యూటా?...?" అన్నాడు కంగారుగా.

"అవునండి... నేను ఇన్నాళ్ళు టైమ్ అంతా వేస్ట్ చేశాను. ఇన్‌స్టిట్యూట్‌లో ఫాకల్టీగా దొరికింది. పెద్ద జీతం కాదు లెండి... కాని... నా సంఘసేవకి సరిపోతుంది అని కారు ఎక్కింది.

"ఒక్క క్షణం..." ప్రమీల కళ్ళల్లోకి బాధగా చూశాడు.

"సారీ!... ప్రమీలా!... నాకు తెలియకుండానే... నిన్ను బాధపెట్టాను..." అని ప్రసాద్ అనగానే...


"అబ్బబ్బ... ఊరికే ఫీల్ అయిపోకండి... నేను దిగవలసిన స్టాప్ వచ్చేసింది... ఆపండి" అంది ప్రమీల.

"కారు ఆగింది...

"సాయంత్రం ఎన్నిగంటలకి నీ వర్క్ అయిపోతుంది. నేను వచ్చి నిన్ను పికప్ చేసుకుంటాను" అన్నాడు.

"అబ్బా! అక్కర లేదు... రిటన్‌లో ఆటోలో ఇంటికి వచ్చేస్తాను లెండి..." అని గబగబా ఇన్‌స్టిట్యూట్‌లోకి వెళ్ళింది.

రోజులు గడుస్తున్నాయి... లక్ష్మి రెండవ తరగతి పాసయి మూడో తరగతిలోకి వచ్చింది. నాటిన మొక్కకి... చిగురు వస్తున్నా అపురూపంగా కనిపిస్తుంది... లక్ష్మి రెండో తరగతి



పాసయి మూడో తరగతిలోకి రావడం ప్రమీలకి... ఎంతో సంతోషంగా ఉంది.

"ఏంటి రంగమ్మా అదోలా ఉన్నావు... వంట్లోగాని బాగుండలేదా" అంది ప్రమీల...

"నాకేం అమ్మా! నేను బాగానే ఉన్నాను... అదేం పని చేశాడో ఏమో... సచ్చినోడిని జైలులో పెట్టారమ్మా... వాడిని ఇప్పట్లో విడిచి పెట్టరని... అందరూ చెప్పుకుంటున్నారమ్మా" అంది...

"అయ్యో!... అలాగా... అని ఏదో ఆలోచన మనసులో మెదలడంతో... "రంగమ్మా!... బాధపడకు... అన్నట్లు లక్ష్మిని చదువు మానిపించాలనుకుంటున్నావా?" అంది.

"వాడికోసం నేనెందుకు బాధపడతా నమ్మా?... కాని నా బాధ అంతా ఒకటేనమ్మా! వాడికి పీకలనిండా తాగి... కడుపునిండా మూడు పూటలా తినడం అలవాటు... అందుకు కాస్త బాధపడుతున్నాను... ఈ జన్మలో ఎన్ని ఆటంకాలు వచ్చినా... లక్ష్మి చదువు మానిపించనమ్మా... ఈ ఏడాది చిన్ని గాడిని కూడా స్కూలులో చేర్పిస్తానమ్మా" అంది.

ప్రమీల కళ్ళల్లో సంతోషం కొట్టవచ్చినట్లు కనబడింది రంగమ్మకి...

"అమ్మా!... ఏనాడో పెట్టి పుట్టానమ్మా... బంగారంలాంటి మీ నీడ మాకు దొరికింది అంది రంగమ్మ...

❃ ❃ ❃

రంగమ్మ సడన్‌గా పనికి రాకపోవ టంతో... వంట్లోగాని బాగుండక పనికి రాలేదు ఏమో అనుకుంది ప్రమీల... రోజులు గడుస్తున్నా... రంగమ్మ ఆచూకి తెలియలేదు. చివరికి... రంగమ్మ ఇల్లు కనుక్కోలేక లక్ష్మి స్కూలుకి వెళ్ళింది... "పదిరోజులు పైనే అయింది... లక్ష్మి స్కూలుకి రావడం మానేసి" అని టీచరు చెప్పడంతో అవాక్కయిపోయింది ప్రమీల.

అసలు రంగమ్మకి ఏం జరిగింది? ఏదైనా ఊరు వెళ్ళారా? ఒక్కరోజు పనిమానేస్తేనే ముందుగా చెప్పే రంగమ్మ... ఇలా చేసింది ఏమిటి?" అనుకొంది ప్రమీల.

"ఏవండీ! ఒక్కసారి కారాపండి.." అని రయ్‌మని కారు దిగి ఫుట్‌పాత్ దగ్గరకు పరిగెత్తింది ప్రమీల.

తన కళ్ళని తానే నమ్మలేకపోయింది. స్కూలు డ్రస్ పూర్తిగా మాసిపోయి... ఎన్నో రోజుల నుండి తలకి నూనె వ్రాయక, తల దువ్వక ఎర్రగా అయిపోయి, రేగిపోయి అట్టకట్టినట్లు కనబడుతున్న జడతో... లోతుకుపోయిన కళ్ళతో...ఒడిలో నాలుగేళ్ళ చిన్నిని కూర్చోబెట్టుకొని" అయ్యలారా!... అమ్మల్లారా.. దాణం చేయండి. బువ్వతిని చాలా రోజులయింది. అయ్య జైల్లో ఉన్నాడు... అమ్మ మంచం మీద ఉంది. చాలా పెద్ద జబ్బు చేసింది. లేవలేదు... అమ్మా!.. అమ్మా!... డబ్బు లేయండి... ఆ డబ్బులెట్టి బువ్వ వండుకుంటాం!... అయ్యా!... డబ్బు లేయండయ్యా!" అని ప్రాధేయపడసాగింది లక్ష్మి.

లక్ష్మి ఒడిలో కూర్చున్న చిన్ని, కొండజాతి పిల్లాడులా ఉన్నాడు... వాడు ఒకటే ఏడవ సాగాడు.

"చిన్నీ!... ఏడవకురా!... డబ్బులు కూడి నాక బియ్యం కొనుక్కొని... గంజి బువ్వ తిందాం" అంది లక్ష్మి.

ప్రమీలకి భూమి గిర్రున తిరుగుతున్నట్లనిపించింది. తను అనుకున్నది ఏమిటి?... జరిగింది ఏమిటి? తన మట్టుకు తాను ఒక బాలకార్మికురాలికయినా విముక్తి కలిగించి, చదివించి ప్రయోజకురాలిని చేయాలనుకుంది. కాని చేయలేకపోయింది. ఇక దేశంలో బాలకార్మికులందరూ చదువుకోవడం ఎంతవరకు అవుతుంది? అసలు బాలకార్మికులు లేకుండా చదువుకోవాలి. బడికి వెళ్ళాలి అనుకుంటే సరిపోదు. ముందు చేయవలసింది. బాలకార్మికుల కుటుంబ వ్యవస్థ. సరిచేయడం... కుటుంబంలో అందరూ కాకపోయినా కనీసం ఒకరయినా ఆర్థికంగా తమ కాళ్ళమీద తాము నిలబడే స్థితిలో ఉండాలి!... అప్పటికి కాని... ఆ కుటుంబంలో పిల్లలు బాల కార్మికులు కాకుండా బుడి బుడి నడకలతో స్కూలుకి వెళ్ళలేరు. మరి ఆ కుటుంబం పరిస్థితి ఆర్థికంగా నిలబడాలంటే... ఒక్క ప్రభుత్వానిదే బాధ్యతా?... దేశంలో ఎందరి లాకర్లలోనో బ్యాంకులలోనో, బినామీ పేర్లతో మూలుగుతున్న ధనం బ్లాక్‌మనీ... ఉన్నవాళ్ళందరూ కలిసికట్టుగా... ముందడుగు వేసి... బాల కార్మికులకు విముక్తి కలిగించాలి...

కాని... ఇదంతా జరిగే పనేనా?... అసలు బాలకార్మికుల గురించి ఆలోచించేదెవరు? ఒక్క నిముషం మనది ఈ దేశం... ఈ దేశంలో మనుషులందరూ నా వాళ్ళే... చేతనయిన సహాయం చేద్దాం... అని ఆలోచిస్తే... లక్ష్మిలాంటివాళ్ళు అర్ధాంతరంగా బిచ్చ గత్తెగా మారరు. ఎడతెరిపిలేని ఆలోచనలు ప్రమీల మనసులో చోట్లుచేసుకో సాగాయి. ❃

## అక్టోబర్ 8న 'బల్లే బల్లే'!

ఐశ్వర్యారాయ్ నటించిన 'బ్రైడ్ అండ్ ప్రెజుడిస్' సినిమా హిందీలో 'బల్లే బల్లే' పేరుతో అక్టోబర్ 8 దేశ వ్యాప్తంగా విడుదలవనుంది. ఇంగ్లీష్, హిందీ భాషల్లో రెండూ ఒకే రోజున విడుదల చేయాలని భావిస్తున్నట్లు చిత్ర నిర్మాతలు తెలిపారు. హాలీవుడ్‌లో ఈ సినిమా హిట్టయితే ఐశ్వర్యారాయ్‌ని మనం మరో కోణంలో చూడవచ్చని బాలీవుడ్ పరిశీలకులు చెబుతున్నారు.

